మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పేదల సొంత ఇంటి కల సాకారం

## జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**బాలానగర్, నవంబరు 9 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని జీడిగుట్ట తండా గ్రామపంచాయతీ పరిధిలోని పంచాంగుల గడ్డ తాండలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేతావత్ చంద్రశేఖర్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును ఆదివారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, సొంత ఇల్లు లేని పేదలకు సొంతింటి కలను నెరవేరుస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పారదర్శక విధానంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అందిస్తామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, తండాల పురోగతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి గ్రామం, ప్రతి తండా అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేస్తున్నామని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కురుమూర్తిస్వామి దేవస్థానం

# 17న స్వామివారి ఆభరణాలు తొలగింపు

**మహబూబ్‌నగర్, నవంబ 9 ప్రభాతవార్త :** పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 22 నుంచి ఈ నవంబర్ 7 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. శుక్రవారం స్వామివారు ఆభరణాలు తొలగించాల్సి ఉండగా బ్రహ్మోత్సవాలపై వర్ష ప్రభావం కారణంగా భక్తులు పూర్తిస్థాయిలో బ్రహ్మోత్సవాలకు హాజరు కాకపోవడం, జాతరలో వ్యాపారాల నిర్వహించే వ్యాపారస్తుల వినతి మేరకు ఈ నెల 17 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని అదే రోజున స్వామి వారి ఆభరణాలు తొలగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలు 17 వరకు కొనసాగుతున్న నేపథ్యంలో పల్లె ప్రాంతాలనుంచే కాకుండా పట్టణ ప్రాంతాల నుంచి భక్తజనులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.





ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం

# అంబులెన్స్ లేక ప్రజల ఇక్కట్లు

**దేవరకద్ర, నవంబరు 9 ప్రభాతవార్త:** ప్రభుత్వం మండలానికి ఒక అంబులెన్స్ కేటాయించింది. కానీ కౌకుంట్ల మండలం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఇక్కడ అంబులెన్స్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పక్కా మండలలా నుంచి 108 వాహనం సకాలంలో రావడంలేదని ప్రజలు వాపోతున్నారు. పక్క మండలాల నుంచి కౌకుంట్ల మండలానికి సంబంధించి ఆరోగ్య కేంద్రం ఉంది. ఈ ప్రాంతంలో రాత్రివేళ ప్రమాదాలు జరిగితే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి. ఇక్కడ అంబులెన్స్ లేకపోవడంతో 20 కిలోమీటర్ల దూరంలోని చింతకుంట, 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరకద్రలోని వాహనాలపై ఆధారపడుతున్నారు. ఒకవేళ అంబులెన్స్ ఆసుపత్రిలో ఉన్న, దూరం ఎక్కువగా ఉండడంతో సమయానికి రావడం లేదు. దీంతో బాధితులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి కౌకుంట్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ వాహనం కేటాయించాలని కోరుతున్నారు.

**వైద్యాధికారి, డా. రఘువరన్‌ను వివరణ కోరగా...**

కౌకుంట్ల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని నివేదికలను పంపించాం. ఇక్కడ వైద్య సేవలు అందుతున్నాయి. 108 వాహనం సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

# శిథిలావస్థలో.. ప్రభుత్వ కార్యాలయాలు

- సమీకృత భవనాల నిర్మాణం ఎప్పుడో..?
- ఇబ్బందుల్లో ప్రజలు అధికారులు
- సర్వేతో సరిపెట్టుకున్నారా..?
- దిష్టిబొమ్మలా ఆర్టీసీ బస్టాండ్



మండల ప్రజాపరిషత్ కార్యాలయం ముందు చేరిన వర్షపు నీరు

**వంగూరు, నవంబరు 9 ప్రభాతవార్త :** ప్రతినిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలతో కిటకిటలాడుతూ దర్శనమిస్తాయి. కానీ ఆ కార్యాలయాలకు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు వస్తున్న ప్రజలు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానిక పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడ కూలిపోవడంతో పాటు సమీపంలో ఉన్న తాసిల్దార్ కార్యాలయం మండల పరిషత్ కార్యాలయల ఆవరణములో పెద్ద చెరువు వలె దర్శనమిచ్చింది. ఇది ఇలా ఉంటే బిసి ఎస్సి వసతి గృహాలు ఎప్పుడు కులుతాయో అన్న భయంతో విద్యార్థులు తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని నిద్రించాల్సిన దుస్థితి నెలకొంది.

**సమీకృత భవనాల నిర్మాణం ఎప్పుడో..?**

వంగూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల దుస్థితిని చూసి ప్రస్తుత కాంగ్రెస్‌ప్రభుత్వం ఈ భవనాలను ఖననం చేసి అన్ని భవనాలను ఒకే చోట నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే భూ సర్వేను నిర్వహించి త్వరలోనే భవనాల నిర్మాణానికి భూమి పూజ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్న నేటికీకూడా సమీకృత భవనాల నిర్మాణ ఏర్పాటుకు పాలకులు అధికారులు పూనుకోకపోవడంతో కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు రైతులు ఇబ్బందులు పడుతున్నారనే చెప్పుకోవచ్చు. వర్షాలు కురిస్తే వరదలు వచ్చి కార్యాలయాలకు వేసిన తాళం తీయకుండానే అధికారులు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్న మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు ప్రజల రక్షణ కోసం 24 గంటలు విధులు నిర్వహిస్తున్న



బిసి వసతి గృహం

రక్షక భటులకే రక్షణ కరువైందనడంలో ఆశ్చర్యం లేదు. భారీ వర్షాల కారణంగా స్థానిక పోలీస్ స్టేషనులకు పోవడానికి విలువ లేకుండా ప్రహరీ గోడ కూలిపోవడంతో వరద తాకిడికి రహదారి గుంతల మయంగా ఏర్పడిన సంగతి విధితమే. దీంతో తాత్కాలికంగా పోలీస్ స్టేషన్కు వెళ్లేందుకు మరమ్మత్తులు చేయించారు. గతంలో నిర్మించిన పోలీస్ స్టేషన్ పూర్తిగా శిథిలావస్థలో ఉండడంతో ఆ భవనం నుంచి ఎస్సై క్వాటర్స్ లో పోలీస్ స్టేషన్ ను మార్చి విధులు నిర్వహిస్తున్నారు.

**దిష్టిబొమ్మల ఆర్టీసీ బస్టాండ్...**

వంగూరు మండల కేంద్రానికి ఇటు కల్వకుర్తి అటు అచ్చంపేట రెండు బస్సు డిపోలు ఉన్నప్పటికీ మండల కేంద్రం మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ఒక్క బస్సు కూడా గ్రామానికి రాకపోవడం సోషనీయంగా మారింది. గ్రామంలో బస్సులు నిలిపేందుకు లక్షల రూపాయలను వెచ్చించి ఆర్టీసీ బస్టాండ్ ను గత కొన్ని సంవత్సరాలు క్రితం నిర్మించి అప్పటి మంత్రి డీకే అరుణ తో ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. కానీ ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభానికి పరిమితమై నేటికి కూడా ఆ బస్టాండ్ లోకి ఒక్క బస్సు కూడా పోకపోవడం నిల్పకపోవడం ఈ మండల ప్రజల దురదృష్టమేనా అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇరువైపులా రెండు నియోజకవర్గాలలో బస్సు డిపోలు ఉన్నప్పటికీ వంగూరు మండల కేంద్రానికి బస్సు రాకపోవడం వలన ప్రతినిత్యం వందలాదిమంది ప్రభుత్వ కార్యాలయానికి వారి సమస్యల పరిష్కారం కోసం రావడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో నానా తంటాలు పడి కార్యాలయానికి చేరుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. మండలంలో అన్ని గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణం ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడం ఏమిటని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.



అచ్చంపేట నియోజకవర్గంలోని మండలాలతో పోల్చుకుంటే వంగూరు మండలం చాలా వెనుకబడి ఉంది. దీనికి కారణం సరైన నాయకులు లేకపోవడంతోనే అని అర్థం అవుతుంది. అప్పట్లో శ్రీశైలం హైవే వంగూరు గ్రామంలో నుంచి రాకుండా అడ్డుకున్నారు. వంగూరు మండల కేంద్రానికి వచ్చిన మాడల్ స్కూల్‌ను రాకుండా చేశారు. అలాగే వంగూరులో రెండు సంవత్సరాలు నడిచిన గురుకుల పాఠశాలను కల్వకుర్తికి తరలించారు. మోరి కాలువలు లేవు నీళ్ల మొత్తం రోడ్లపై పారుతూ ఇండ్లలోకి పోతున్నాయి. దానివల్ల అందరు రోగాల బారిన పడుతున్నారు. ఎస్సీ వసతి గృహం, బీసీ వసతిగృహం శిథిలావస్థకు చేరాయి. బస్టాండ్ నిర్మించి యేండ్లు గడుస్తున్నా బస్‌లకు నోచుకోలేదు. బస్సుల సౌకర్యం లేదు, గ్రామాల పేర్ల మీద బస్సులు బోర్డు పెట్టుకుని ఉన్నాయి, కానీ ఒక మండలం అయిండి కూడా ఇప్పటివరకు వంగూరు పేరుతో బస్సు బోర్డు లేదంటే చుడండి నాయకులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ వరదలతో నీటిలో మునుగుతున్న పట్టించుకునే నాథుడు కరువైయారు.

**మీసాల స్వామి... వంగూరు**

**లోపం ఎక్కడ ఉంది....?**

ప్రభుత్వాలు మారినా పాలకులు మారిన వంగూరు మండల కేంద్రం మండల అభివృద్ధి మాత్రం శూన్యంగానే మారుతుంది. ఎవరు అధికారంలో ఉన్న ఈ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రగడ్ బాలు పలుకుతున్నారే తప్ప అభివృద్ధిపై ఆసక్తి చూపడం లేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రతిపక్ష నాయకులు పాలకవర్గంపై అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ.... ప్రతిపక్షం నుండి పాలక పక్షం వచ్చేవరకు వారు కూడా మండల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించకపోవడం పరిపాటిగానే మారింది. వంగూరు మండల అభివృద్ధి మండల కేంద్రంలో సమీకృత భవనాల నిర్మాణం మండల కేంద్రానికి బస్సు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తారా లేదా వేచి చూడాల్సిందే.

# ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు భారీ స్పందన

**- 600మంది విద్యార్థులు హాజరు**

**- ఈనెల23న ఫైనల్ పరీక్ష : గుండా మనోహర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్9, ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో,మహబూబ్‌నగర్ ఫస్ట్‌ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ (ఎన్ఎంఎంఎస్) మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు మంచి స్పందన లభించింది. వివిధ పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు ఈ మెరిట్ స్కాలర్ షిప్ స్క్రీనింగ్ పరీక్షలో పాల్గొన్నారు.స్థానిక మాడ్రన్ హైస్కూల్ పరీక్షాకేంద్రంలో 400మంది విద్యార్థులు, హన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 200 మంది విద్యార్థులు పరీక్ష రాశారని మహబూబ్ నగర్ ఫస్ట్ కోఆర్డినేటర్ గుండా మనోహర్ ఈ వివరాలు వెల్లడించారు.ఈపరీక్షలో మెరిట్ సాధించిన 100మంది విద్యార్థులకు జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి శ్రీ లలితాంబికా అమ్మవారి ఆలయం ప్రాంగణంలో పది రోజులపాటు ఈనెల 12 నుంచి 22వ తేదీవరకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను నిష్ణాతులైన అధ్యాపకులు ఆధ్వర్యంలో అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఫైనల్ పరీక్ష ఈ నెల 23న జరగనుందని ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి,పరీక్షా సరళిని పరిశీలించారు. అనంతరం వలంటీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దుంకుడు శ్రీనివాస్, వందేమాతరం ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి , హన్వాడ మండల ఎంఇఓ గోపాల్ నాయక్, తాటికొండ ప్రధానోపాధ్యాయులు బాలు యాదవ్, మాడ్రన్ స్కూల్ హెచ్ ఎం దత్తు రవి, హన్వాడ మండల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష సరళిని పర్యవేక్షిస్తున్న గుండా మనోహర్, అధికారులు



రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

# రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

**- ఇతరులతో షాప్ నిర్వహిస్తే చర్యలు**

**- చౌక ధర దుకాణాలను తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు9,ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పలు చౌకధర దుకాణాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలో బండ్లగేరి, వీరన్నపేట్, టి. డి.గుట్ట ప్రాంతాలలో మహబూబ్‌నగర్ పట్టణ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాజీవ్ రెడ్డితో కలిసిగల చౌకధర దుకాణం నెంబర్ 12, 19, 21, 34, 42 ఆయన తనిఖీ చేశారు షాప్ నెంబర్ 34లో డీలర్ కాకుండా వేరే వ్యక్తితో షాప్ నిర్వహించడం గమనించి షాప్ అసలు డీలర్‌కు షోకాస్ నోటీసు ఇవ్వాలని మహబూబ్ నగర్ అర్బన్ తహసీల్దార్‌ను ఆయన ఆదేశించారు. అలాగే అన్ని చౌక ధర దుకాణాలు సమయానుకులముగా ఉదయం సాయంత్రం తప్పనిసరిగా తెరిచి ఉంచాలని ఆదేశించారు.

# ట్రిపుల్ ఆర్ మాకొద్దు..

- మా పొలాల గుండా వెళ్తే రోడ్డున పడుతాం..
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని అడ్డుకున్న పంచాంగుల గడ్డ తండావాసులు



ఎమ్మెల్యేను అడ్డుకున్న తండావాసులు

**బాలానగర్, నవంబర్9,ప్రభాతవార్త:** ఆర్ఆర్ఆర్ రోడ్డు నిర్మాణం పేరిట తమ భూములు లాక్కొని తమకు జీవనోపాధి లేకుండా తమ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని, ఒకవేళ తమ గ్రామం మీదుగా రోడ్డు తీసుకుపోయేందుకు ప్రణాళికలు చేస్తే తాము మాత్రం సెంటు భూమి కూడా ఇవ్వమని తండావాసులు తేల్చిచెప్పారు. తమ భూముల మీదుగా ఆర్ఆర్ఆర్ రోడ్డు వేయడానికి వెళ్లేదని తమ భూముల మీదుగా ఆర్ఆర్ఆర్ రోడ్డు వేయకుండా అడ్డుకోవాలని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డిని బాలానగర్ మండల లో పరిధిలోని పంచాంగుల గడ్డ తండా గిరిజనులు అడ్డుకున్నారు. ఆదివారం బాలానగర్ మండల పరిధిలోని జీడి గుడ్డ తండా గ్రామపంచాయతీ పరిధిలోని పంచాంగుల గడ్డ తండాలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిని అడ్డుకున్నారు. ఆర్ఆర్ఆర్ రోడ్డు నిర్మాణంలో భాగంగా తమ గ్రామం మీదుగా రోడ్డు వెళుతుందని పలువురు -మిగతా3లో..

## లోక్ అదాలత్‌తో ప్రజలకు సత్వర న్యాయం

- రాజీ - పరిష్కారం వైపు తొలి అడుగు
- ఈనెల15న స్పెషల్ లోక్ అదాలత్
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్9,ప్రభాతవార్త :** ఈ నెల 15న శనివారం జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్ ను కక్షిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి విజ్ఞప్తి చేశారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..లోక్‌అదాలత్ ద్వారా త్వరితగతిన, తక్కువ ఖర్చుతో, ఇరువైపులా సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు అని వివరించారు. "చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దు. రాజీ అంటే విజయం వైపు దారితీసే నిజమైన మార్గం" అని పేర్కొన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు.అదే విధంగా జిల్లా పోలీసు అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, కోర్టు -మిగతా3లో..

# శ్రీ కురుమన్న కొండ.. భక్తజనం నిండా

**జాతర రహదారులు భక్తులతో కిటకిట.. పట్టణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన యాత్రికులు**








శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకున్న భక్తులు



**మహబూబ్‌నగర్, నవంబరు 9 ప్రభాతవార్త :** తిరుమల వెంకటేశ్వరుడిగా భక్తుల పూజలు అందుకుంటున్న శ్రీ కురుమన్న స్వామి కొండకు భక్తులతో నిండిపోయింది. ఆదివారం కావడంతో పట్టణ ప్రాంతాల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి యాత్రికులు తరలి రావడంతో జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కొండ దిగువ నుంచి స్వామివారి సన్నిధి వరకు క్యూలైన్లు భక్తులతో నిండిపోయింది. భక్తులను అదుపు చేయడంలో పోలీసులు నానా అవస్థలు పడ్డారు. కొండ దిగువన వ్యాపార సముదాయాలు యాత్రికులతో కిక్కిరిసిపోయింది. మాంసపు దుకాణాలు మాంస ప్రియలతో నిండిపోయింది. పట్టణ ప్రాంతాల వందలాది కార్లలో భక్తులు తరలివచ్చారు. కొండపై ఉద్దాల మండపం చెన్నకేశవస్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు.

## పేటలో ఘనంగా మాతా మాణికేశ్వరి 7వ వార్షికోత్సవ వేడుకలు

**నారాయణపేట, నవంబరు 9 ప్రభాతవార్త :** నారాయణపేట పగిడిమర్రి రోడ్డులో గల శ్రీ సద్గురు రూపరహిత అహింసా యోగేశ్వరి వీరధర్మజ మాతా మాణికేశ్వరి ఆశ్రమంలో ఏడవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ధ్వజారోహణంతో ప్రారంబమైన వేడుకల్లో గోమాత పూజ, నాగ సింహాసన అభిషేకం, అమ్మవారి పాదుకల పూజలు, మహా గాయత్రి యజ్ఞం, మంగళహారతి కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. మహిళలు ఓంకారం త్రిశూలాకార కార్తీకదీపాలంకరణతో ఆకట్టుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదం, అన్నదానకార్యక్రమాలు నిర్వహించారు. ఈవేడుకల్లో డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభంశివకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీచైర్మన్ శివారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్య క్షుడు కోట్లమధుసూదన్ రెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.



మాత మాణికేశ్వరి వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## గోడ పత్రిక విడుదల

**దామరగిద్ద, నవంబరు 9 ప్రభాతవార్త :** వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ చేశారు. దామరగిద్ద మండల పరిధిలోని దేశయిపల్లి గ్రామంలో నేడు కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమనికి రాష్ట్రములో ప్రత్యేక శాఖను కొనసాగించాలని జీఓ నెంబర్ 34ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు ఉండి సదరం ధ్రువపత్రాలు మంజూరై ఏళ్ళు గడుస్తున్నా కొత్త పెన్షన్స్‌ను ప్రభుత్వం మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన పెన్షన్స్ మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రములో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన ఎన్నికల ముందు ఇచ్చిన హామీ వికలాంగులకు ఆరు వేయిల రూపాయలు హామీ నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో హన్మంతు, మల్లప్ప, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక విడుదల చేస్తున్న దృశ్యం

## హిందువుల్లో ఐక్యమత్యం ఎంతో ముఖ్యం

**నారాయణపేట, నవంబరు 9 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా విభాగం ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కేంద్ర అధికారి మాననీయ వినాయక్ పాండే పాల్గొని హిందూ సంఘటనా బలపరచడంపై సూచనలు చేశారు. నారాయణపేట జిల్లా గౌరవాధ్యక్షురాలు సురేఖ రాంబాబు, ప్రధాన కార్యదర్శి కన్నా శివకుమార్, ఉపాధ్యక్షురాలు ఉమా, సహకార కార్యదర్శి లలిత, జిల్లా ఉపాధ్యక్షులు ఎంగలి రాములు, రామకృష్ణ గౌడ్, మరాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా గో సేవా ప్రముఖ్ సందీప్ మిస్కిన్, సేవా ప్రముఖ్ కృష్ణ, సంపంగి, బజరంగ్ దళ్ సహ సంయోజక్ భీమేష్, నగర అధ్యక్షుడు మురళి భట్టడ్, నగర బజరంగ్ దళ్ సహ సంయోజక్ ఆకాష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హిందూ కలిసికట్టుగా ఐక్యమత్యంగా ఎలా ముందుకెళ్లాలని సేవా కార్యక్రమాలపై చర్చలు జరిపారు.



విహెచ్‌పి సమావేశంలో పాల్గొన్న నాయకులు

## ఆర్‌టీఐ విచారణకు నోటీసు జారీ చేసిన తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్

**ఊట్కూర్, నవంబరు 9 ప్రభాతవార్త :** తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్ అనారోగ్య సేవలకు సంబంధించిన సమాచారం కోరిన కేసులో విచారణకు నోటీసు జారీ చేసింది. ఊట్కూర్ మండలంలోని మొగ్ధంపూర్ గ్రామానికి చెందిన కె.నర్సింహులు 2024 నవంబర్‌లో దాఖలు చేసిన సమాచార హక్కు దరఖాస్తు (ఆర్‌టీఐ)కు సంబంధించి సరైన సమాచారం అందకపోవడంతో, ఆయన కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్ 2025 నవంబర్ 14న మధ్యాహ్నం 1 గంటకు నారాయణపేట్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విచారణ నిర్వహించనున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. విచారణకు ప్రజా సమాచార అధికారి – ఊట్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అలాగే మొదటి అప్పీలేట్ అధికారి – జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, నారాయణపేట్ జిల్లా హాజరు కావాలని కమిషన్ ఆదేశించింది. కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతివాదులు 6(1) దరఖాస్తు, 19(1) అప్పీల్, అందజేసిన సమాచార వివరాలు, రసీదులు, అఫిడవిట్‌లతో హాజరు కావాల్సి ఉంటుంది. అలాగే అప్పీలుదారుడు కూడా తాను పొందిన లేదా పొందని సమాచారానికి సంబంధించిన ఆధారాలతో విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది.



నోటీసు జారీ చేసిన తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్

## బీసీలు రాజ్యాధికారం కోసం ఏకం కావాలి

**42% రిజర్వేషన్ పోరాటం చేసి సాధించుకుందాం**

**జిల్లా బీసీ సేన అధ్యక్షులుగా సుప్ప ప్రకాష్ నియామకం**

**బాలానగర్, నవంబరు 9 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్ర సమీపంలోని పెద్దాయపల్లి చౌరస్తాలో ఆదివారం మహబూబ్ నగర్ జాతీయ బీసీ సేన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలకు బీసీలంతా ఏకం కావాలని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను పోరాడి సాధించుకుందాం అన్నారు. రాబోయే రోజుల్లో బీసీ రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బానిసత్వం వీడి.. స్వపరిపాలన కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. పదవులు రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం బాలానగర్ మండలంలోని మాచారం గ్రామానికి చెందిన సుప్ప ప్రకాష్‌ను మహబూబ్‌నగర్ జిల్లా బీసీ సేన అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా సుప్ప ప్రకాష్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిసి సేన రంగారెడ్డి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి జయ శ్రీకాంత్, బీసీ సేన రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు గిరిబాబు, బాలు నాయక్, గుడిసెల బాలయ్య, కుర్వ శ్రీను, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.




సుప్ప ప్రకాష్‌ను అభినందిస్తున్న బిసి నాయకులు

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**దామరగిద్ద, నవంబరు 9 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 2004,05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 20 ఏండ్ల తరువాత అదే పాఠశాలలో ఒకరినొకరు కలుసుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తించుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జిహెచ్‌ఎం సురేష్, శంభలింగం, తిప్పన, చంద్ర ప్రకాష్ రెడ్డి, సతీష్, మనోహర్, పూర్వ విద్యార్థులు నరేష్, అమ్రేష్, రాజు అంజప్ప, శ్రీనివాస్, వెంకటప్ప, వినోద్, తదితరులు పాల్గొన్నారు.




# న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలి

**అలంపూర్ నుండి హైదరాబాదుకు వరకు పాదయాత్ర ప్రారంభం**

**గద్వాల, నవంబర్9, ప్రభాతవార్త:** న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అలంపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అలంపూర్ నుండి హైదరాబాద్ వరకు పాదయాత్రను ప్రారంభించారు. ఈసందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో న్యాయవాదులపై భౌతిక దాడులు నిత్యం ఏదోఒకచోట జరుగుతున్నాయన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టంకోసం పాదయాత్రను చేపట్టామని, ఈ పాదయాత్ర దాదాపు పది రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. ఈపాదయాత్ర దాదాపు పది రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలుచేయాలని, జూనియర్ న్యాయవాదులకు 5000 రూపాయలు స్టైఫండ్ ఇవ్వాలని, న్యాయవాదులు అందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, సిఆర్పిసి సెక్షన్ 41(ఏ ), బిఎన్ఎస్ సెక్షన్ 35(1) అమైన్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ చేరుకుని రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు జడ్జిలకు తమ సమస్యలు విన్నవించి, వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. అంతకుముందు జోగులాంబ బాల బ్రహ్మేశ్వరులను దర్శించుకుని పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గవ్వల శ్రీనివాసులు నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, గజేంద్ర గౌడ్, ఆంజనేయులు, మధు, వెంకటేష్, హేమంత్ యాదవ్, యాకూబ్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు. మద్దతు ప్రకటించిన ప్రముఖ న్యాయవాదులు. అలంపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బారాసోసియేషన్ అధ్యక్షులు అనంతరెడ్డి, సిట్టింగ్ స్టేట్ బార్ మెంబర్ హనుమంతు రెడ్డి, మహబూబ్ నగర్ సీనియర్ న్యాయవాది ఎన్పి వెంకటేష్, షాద్ నగర్ న్యాయవాది జగన్మోహన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మద్దతు తెలిపారు.



ఆలయంలో న్యాయవాదులు

## కార్మిక వర్గ హక్కులకై ఉద్యమించండి!

**టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే.సూర్యం**

**మహబూబ్‌నగర్, నవంబరు 9 ప్రభాతవార్త :** కార్మికుల హక్కులకై కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పర్దిపూర్ గ్రామంలో టియుసిఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులకు టీయుసిఐ జిల్లా అధ్యక్షులు జేఎన్ దేవదానం అధ్యక్షత వహించగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలోకి పైగా సంఘటిత అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గం తమ రక్త మాంసాలను ఒడిసి సంపదను సృష్టిస్తూ అర్థాకలితో అలమటిస్తూ కనీసమైన హక్కులను, చాలా పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు ఎర్ర తివాచీలు పరుస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడలుగా విభజిస్తూ కార్మిక పొట్టలు కొడుతున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంఘటిత అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గం ముందుండి ఉద్యమించాలని ఆయన ఈ శిక్షణ సందర్భంగా సిపిఐ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రామచందర్ పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలు పని విధానం అనే అంశంపై టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే.సూర్యం, భారత కార్మిక ఉద్యమం అనే అంశంపై పి. అరుణ్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోళ్ల వెంకటన్న, ఏ.కొండన్న, వెంకట్రాములు, అరుణక్క, బాలు, వెంకటేష్ గౌడ్, అడివన్న, కోళ్ల అంజన్న, నర్వ గోపాల్, అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర కోశాధికారి కే చంద్రన్నతోపాటు గ్రామపంచాయతీ, కేజీబీవీ, రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ గోదాం, ఆటో, భవన నిర్మాణ, బీడీ కార్మికులు పాల్గొన్నారు.




శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు

## అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు

**స్నేహితుడికి ఆర్థిక సాయం అందించిన పూర్వ విద్యార్థులు**

**దేవరకద్ర, నవంబరు9 ప్రభాతవార్త:** తమతో కలిసి చదువుకున్న బాల్య మిత్రుడు కష్టాల్లో ఉన్నాడని తెలిసి అండగా నిలిచారు పూర్వ విద్యార్థులు. కౌకుంట్ల మండలం, పేరూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1993 ,94 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు తమ తోటి వికలాంగ స్నేహితుడు కష్టాల్లో ఉన్నాడని గుర్తించి ఆర్థిక సహాయం అందించారు. పేరూరు గ్రామానికి చెందిన కే.రాజు గౌడ్ చిన్నప్పటినుండి వికలాంగుడు అయినప్పటికీ ఆత్మస్థైర్యంతో స్నేహితులతో చదువుకునే రోజుల్లో నుండి ఆటపాటల్లో అన్నిట్లో పోటీపడేవాడు. కాలక్రమేనా చదువు పూర్తయిన తర్వాత పూర్వ విద్యార్థులందరూ వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తూ దూరమయ్యారు. ఈ మధ్యకాలంలో జరుపుకున్న గెట్ టు గెదర్ కార్యక్రమం ద్వారా మళ్ళీ కలుసుకొని ఒకరికొకరు సాధక బాధకాలు చెప్పుకుంటూ కష్టాల్లో ఉన్న తోటి స్నేహితులకు సహాయం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే రాజు గౌడ్ కు కొంత ఆర్థిక సాహాయం చేశారు. అంతేకాకుండా అదే గ్రామానికి చెందిన బాలస్వామి అనే మరో స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిసి తన ఇంటికి వెళ్లి పరామర్శించి మేమున్నామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రులు ప్రతాప్ రెడ్డి, వెంకటేష్, మోహన్ రావు, కృష్ణసాగర్, శంకర్, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, సతీష్ సాగర్ తదితరులు ఉన్నారు.




స్నేహితునికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

## కంప్యూటర్ విద్య ప్రతి ఒక్కరికీ అవసరం

**నారాయణపేట, నవంబరు9 ప్రభాతవార్త:** నూర్‌జహాన్, అబ్దుల్ హఫీజ్ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో నారాయణపేటలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ కోర్సు 7వ, 8వ బ్యాచ్ విద్యార్థుల తుది పరీక్షలు స్థానిక మోడరన్ హైస్కూల్‌లో విజయవంతంగా పూర్తయ్యాయి. పెద్దసంఖ్యలో విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈసందర్భంగా ఇన్స్టిట్యూట్ స్థాపకులు అమెరికా చికాగోకు చెందిన సైకాలజిస్ట్ డా.మొహమ్మద్ కుతుబుద్దీన్ ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కంప్యూటర్ విద్య నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయకుండా ప్రాక్టికల్ నైపుణ్యాలు ప్రోగ్రామింగ్ గ్రాఫిక్ డిజైన్ డేటా అనాలిసిస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కంప్యూటర్ విద్య యువతలో నమ్మకం స్వావలంబన పోటీ సామర్థ్యాలను పెంచుతుందని తెలిపారు. ఇప్పటివరకు ఎనిమిది ఉచిత బ్యాచ్‌లు విజయవంతంగా పూర్తయ్యాయని వందలాది విద్యార్థులు లబ్ధి పొందారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖదీర్ సందకే హాఫిజ్ మొహమ్మద్ తఖీ హాఫిజ్ ముస్తాఫా ఖాదరీ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించండి...

**పుట్టపల్లి, గోపన్ పల్లి, బస్వాయిపల్లి, కాంగ్రెస్ నాయకులు**



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**దేవరకద్ర, నవంబరు 9 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డ డివిజన్‌లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ హస్తం గుర్తుకు ఓటు వేసి, కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పుట్టపల్లి చెన్నకేశవులు, బస్వాయిపల్లి శివ, గోవర్ధన్, విక్రమ్, ప్రేమ్, గోపన్ పల్లి శ్రీకాంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అన్నింటినీ కచ్చితంగా అమలు చేసి తీరుతుందని దీంతో ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు క్రీడా సామగ్రి వితరణ

**కార్యక్రమంలో పాల్గొన్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే**

***దేవరకద్ర, నవంబరు 9 ప్రభాతవార్త:*** దేవరకద్ర మండల కేంద్రంలోని మూడు పాఠశాలలకు క్రీడా సామాగ్రిని మహబూబ్‌నగర్ రిషి కాలేజ్ డైరెక్టర్ వెంకటయ్య అందజేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వెంకటయ్య పదవి విరమణ మహోత్సవ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటయ్య పనిచేసిన కోటకొండ, కోయిల్ సాగర్, వింజమూరు, పాఠశాలలకు క్రీడా సామాగ్రిని తమ సొంత డబ్బులతో, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

## వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**దామరగిద్ద, నవంబరు 9 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని పిడెం పల్లి, మల్ రెడ్డిపల్లి మరియు కానుకుర్తి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివ కుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం శివారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా శివ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వడ్లను అమ్మాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

## 3 లక్షల ఎల్‌ఓసి అందజేసిన మంత్రి వాకిటి శ్రీహరి



ఎల్‌ఓసి అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, నవంబరు 9 ప్రభాతవార్త:** మక్తల్ ప్రాంతానికి చెందిన చెందిన సత్యమ్మ భర్త పేరు వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని సంప్రదించగా వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 3లక్షలను మంజూరు చేయించారు. సంబంధిత ఎల్‌ఓసిని ఆదివారం మంత్రి అధికారిక నివాసంలో వారికి అందచేశారు. మంచి వైద్యం అంది, బాధితుడు త్వరగా కోలుకోవాలని కాంక్షించారు. రాష్ట్రములోని నిరుపేద ప్రజలకి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

## మల్లన్న సేవలో దేవాంగ్ సంఘం మహిళలు



శ్రీశైల మల్లికార్జున స్వామి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన దేవాంగ్ సమాజ మహిళలు

**నారాయణపేట, నవంబరు 9 ప్రభాతవార్త :** నారాయణపేట మండలంలోని జాజాపూర్ పవిత్ర శ్రీశైల మల్లికార్జున స్వామి సన్నిధిలో దేవాంగ్ సమాజ మహిళలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై భక్తి భావాన్ని చాటుతున్నారు. గత మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ఆహార నీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. స్వామివారి ఆలయంలో శ్రద్ధాభక్తులతో సేవ చేస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రతి సంవత్సరం భక్తి యాత్రలో భాగంగా దేవాంగ్ సమాజ మహిళలు శ్రీశైలంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం పరంపరగా కొనసాగుతుంది. ఈ ఏడాదీ వారు విశేషంగా సేవలందించి మల్లన్న ఆశీర్వాదాలు పొందారు.

## ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

**మద్దూరు ఎస్సై విజయ్ కుమార్**



రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మద్దూరు, నవంబరు 9 ప్రభాతవార్త :** మద్దూరు మండల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, వాహన పత్రాలు, హెల్మెట్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రత మనందరి బాధ్యత అని ఆటో డ్రైవర్లు ఎల్లప్పుడూ జాగ్రత్తగా వాహనాలు నడపాలనీ చిన్న పాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుంది అని తెలిపారు. అదేవిధంగా ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను, కూలీలను ఎక్కించుకోరాదని అలాగే ప్రయాణికులతో మర్యాదపూర్వక ప్రవర్తన, చట్ట ఉల్లంఘనలకు పాల్పడరాదని సూచించారు. రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదు, ఆటో డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు

**మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి**

**మక్తల్ టౌన్, నవంబరు 9 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డా. వినీ త్ ఆదేశాల మేరకు మక్తల్ మండల కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తెలి పారు. ఆదివారం మక్తల్ బస్టాండు ప్రధాన చౌరస్తాలలో మక్తల్ పోలీసులు మనోహర్, శ్రీహరిలు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరిపోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారులు

## అయ్యప్పభక్తులకు అన్నదానం

**భూత్పూర్, నవంబర్ 9, ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీమునిరంగ స్వామి ఆలయంలో ఆది వారం అయ్యప్ప భక్తులకు బీజేపీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సామాజిక సేవా, భక్తిలో భాగంగా అయ్యప్పభక్తులకు అన్నదానం నిర్వహించినట్లు బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండి ఫారూక్, బీజేపీ మండల నాయకుడు కెంద్యాల శ్రీనివాస్ తెలిపారు.



## ప్రజలు పరిమితికి మించి గూడ్స్ వాహనాల్లో ప్రయాణించరాదు

**నారాయణ పేట, నవంబరు 9 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఎస్పీ డా.వినీత్ ఆదేశాల మేరకు నారాయణపేట రూరల్ ఎస్సై రాముడు ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గూడ్స్ వాహనాల్లో ప్రజలు కూలీలు చిన్నపిల్లలను రవాణా చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల రక్షణ రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రూరల్ ఏరియాలో కూలీలను తరలిస్తున్న ఎనిమిది గూడ్స్ వాహనాలను ఆటోలను బొలెరో వాహనాలను పట్టుకుని జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. రిపీటెడ్‌గా ఉల్లంఘనలు చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. గూడ్స్ వాహనాలు కేవలం సరుకుల రవాణా కోసం మాత్రమే ఉపయోగించాల్సిందని వాటిలో వ్యక్తులను తీసుకెళ్లడం చట్టవిరుద్ధమని చెప్పారు. ప్రజలు తమ ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలను మానుకోవాలని కోరారు. రవాణా నియమాలను గౌరవించి సురక్షిత వాహనాల్లోనే ప్రయాణించాలని ఎస్ఐ రాముడు సూచించారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

## సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యం సాగర్

### రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక...

### ఘనంగా సన్మానించిన సగర సోదరులు...

**దేవరకద్ర, నవంబరు 9 ప్రభాతవార్త:** జిల్లా సగర సంఘ ప్రధాన కార్యదర్శిగా దేవరకద్రకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సత్యం సాగర్ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో, జిల్లాలోని సగర సోదరుల ఆమోదంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సత్యం సాగర్ మాట్లాడుతూ తనని ఎన్నుకున్న వారి నమ్మకం నిలబెట్టే విధంగా సగర జాతి ఐక్యత కోసం, సాగర్ల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు ప్రణీల్ చంద్ర సాగర్, కోశాధికారి నారాయణ సాగర్లతో పాటు, జిల్లా, మండల, గ్రామ కమిటీ సభ్యులు, సగర సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యం సాగర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర, నవంబరు 9 ప్రభాతవార్త:** జూబ్లీహిల్ లో కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగుతుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మాట్లాడుతు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహిమత్ నగర్ డివిజన్ లో దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన ఓటర్లను కలిసి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్, హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీ గెలిపించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ తదితరులు

## సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

### - ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### - ఉమ్మడి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కమిటీ

**మహబూబ్‌నగర్, నవంబర్9,ప్రభాతవార్త:** ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని,సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ఔట్ సోర్సింగ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులిలక్ష్మణ్ అన్నారు.మహబూబ్‌నగర్ పట్టణంలో ఉమ్మడిమహబూబ్నగర్‌జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర జనరల్ సెక్రెటరీ దుర్గం శీను మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ సమస్యల సాధన కొరకు అందరం ఐకమత్యంగా పోరాటం చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కర్ణ మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని రద్దుచేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.స్టేట్ ట్రెజరర్ సంతోష్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టికొస్తున్నారని , ఉద్యోగులపై వేధింపులాపాలని వారన్నారు, జిల్లా సెక్రెటరీ కవిత మాట్లాడితూ ప్రభుత్వ కార్యకలాపాలలో సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర వహిస్తున్నటువంటి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి న్యాయం చేయాలన్నారు. మెడికల్ కాంట్రాక్టు యూనియన్ రాష్ట్ర నాయకులు సురేష్ మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతభత్యాల పెంపు మౌలిక వసతులు పెన్షన్ సౌకర్యం ఈఎస్ఐపిఎఫ్ అమలు చేయాలన్నారు. అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామన్నారు. అనంతరం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల కొరకు తీర్మానాన్ని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వనిత రాంగోపాల్ వర్మ, శ్రీనివాసచారి, భరత్, జివేంద్రుడు ,సుభాష్ తదితర నాయకులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఆర్ మాకొద్దు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చెబుతున్నారని అలా రోడ్డు మా గ్రామం మీదుగా వెళితే తమ భూములు కోల్పోయి అనాథలుగా మిగులుతామని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి వ్యవసాయం చేసి తమ కుటుంబాన్ని పోషించుకునే భూములను లాక్కుంటే తాము బతికేది ఎలా అని తమ భూముల మీదుగా త్రిబుల్ ఆర్ రోడ్ వెళ్లకుండా అడ్డుకోవాలని ఎమ్మెల్యే ను కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆర్‌ఆర్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో భాగంగా బాలనగర్ మండల పరిధిలోని పంచాంగుల గడ్డ తండా లోని భూముల సర్వే నెంబర్ లేవని అలా సర్వే నెంబర్లు ఏమైనా ఉంటే తాను తాండ ప్రజల పక్షాన ఉంటూ వారి భూములు కోల్పోకుండా తాను ముందుండి పోరాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# మహబూబ్‌గర్‌జిల్లా సగర సంఘం అధ్యక్షుడిగా ప్రణీల్ చందర్

### - స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలి: రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర

**మహబూబ్‌గర్, నవంబర్ 9,ప్రభాతవార్త:** మహబూబ్‌గర్ జిల్లా సగర సంఘం అధ్యక్షులుగా పాలకొండ సాయి ప్రనిల్ చందర్ సగర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మహబూబ్‌గర్ ఏనుగొండ సగర భవనంలో రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశం అనంతరం జరిగిన ఎన్నికలలో జిల్లా సగర సంఘం అధ్యక్షులుగా జడ్చర్లకు చెందిన పాలకొండ సాయి ప్రనిల్ చందర్ సగర, ప్రధాన కార్యదర్శిగా దేవరకద్ర కు చెందిన గుంటి సత్యం సగర, కోశాధికారిగా మూసాపేటకు చెందిన మద్దిగట్ల నారాయణ సగర లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటాలి: శేఖర్ సగర రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సగరులు నివాసమున్న ప్రతి గ్రామంలో పోటీ చేసి సత్తా చాటాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర పిలుపునిచ్చారు. చైతన్యానికి మారుపేరుగా ఉన్న మహబూబ్నగర్ జిల్లాలో సగరులు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబాటుకు నెట్టివేయబడ్డారని భవిష్యత్తులో రాజకీయ తోడ్పాటు అందించే పార్టీలు నాయకులకు మాత్రమే సగరులు అండగా నిలుస్తారని తెలియజేశారు. సగరులకు రాజకీయంగా అవకాశాలను కల్పించని పార్టీలను దూరం పెట్టాలని అన్నారు.

**మరింత పటిష్టం చేస్తాం: ప్రణీల్ చందర్**

మహబూబ్నగర్ జిల్లాలోని 8 మండలాలు 54 గ్రామాలలో ఉన్న సగరులను చైతన్యపరిచి భవిష్యత్తులో హక్కుల సాధన కోసం జిల్లా సంఘాన్ని మరింత పటిష్టవంతం చేస్తామని నూతనంగా రెండవసారి ఎన్నికైన పాలకొండ ప్రనిల్ చందర్ సగర అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటి సగరుని తట్టి ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ ఫలాలను సాధించడం కోసం, ప్రధాన డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సహకరించని రాజకీయ పార్టీలకు నాయకులకు తాము కూడా ఇక సహకరించమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం గౌరవాధ్యక్షులు ముత్యాల హరికృష్ణ సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి సగర, రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఆర్బి ఆంజనేయులు సగర, గౌరవ సలహాదారులు రామ్ సాగర్, సగర ఆత్మగౌరవ భవన వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ అస్కాని మారుతీ సగర, యాదాద్రి అన్నదాన సత్రం అధ్యక్షులు కె.పి రాములు సగర, రాష్ట్ర మాజీ అధ్యక్షులు బంగారు నరసింహ సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుడ్డన్న సగర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బంగారు ఆంజనేయులు సగర, రాష్ట్ర యువజన సంఘం నాయకులు చందు సగర, సవారి సత్యం సగర, మాజీ జిల్లా అధ్యక్షులు పర్వతాలు సగర, ప్రేమ్ సగర, సి. జి గోవర్ధన్ సగర, నాయకులు హనుమంతు సగర, ఆంజనేయులు సగర, దేవన్న సగర, రవీందర్ సగర పాల్గొన్నారు.


ప్రణీల్‌చందర్‌ను సన్మానిస్తున్న సఘం సభ్యులు


నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

## టీయుడబ్లుజె ఐజెయు రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్‌కు సన్మానం

**భూత్పూర్,నవంబర్ 9,ప్రభాతవార్త :** ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజెయు)కు అనుబంధమైన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టీయుడబ్లుజె) మహబూబ్‌నగర్ జిల్లాశాఖ అడహక్ కమిటీ ప్రత్యేక సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ లో జరిగింది.ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మధుగౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల్ని పరిష్కరించడంలో ఐజెయు ముందుండి పాటుపడుతోందని,జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు తమ సంక్షేమం కోసం సమస్యల పరిష్కారం కోసం ఐజెయులో చేరి సభ్యత్వం తీసుకోవాలని కోరారు.వ్యక్తిగత ప్రయోజనాల కంటే బలమైన యూనియన్ కోసం పనిచేసే జర్నలిస్టులను ఐజెయు ఆహ్వానిస్తోందని తెలిపారు.

**25న ఐజెయు జిల్లా మహాసభలు**

ఐజెయు మహబూబ్‌నగర్ జిల్లా మహాసభలు ఈ నెల 25న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ముధుగౌడ్ తెలిపారు.జిల్లా మహాసభలను చాలెంజ్‌గా తీసుకుని జిల్లా అడహక్ కమిటీ సభ్యులతో పాటు యూనియన్ ప్రతి సభ్యుడు జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు తోడ్పాటునిచ్చి పాటుపడాలని మధుగౌడ్ సూచించారు.

**మధుగౌడ్‌ను సన్మానించిన యూనియన్ సభ్యులు**

ఐజెయు జిల్లా అడహక్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్‌ను యూనియన్ అడహక్ కమిటీ కన్వీనర్ విజయరాజుతో పాటు సభ్యులు సతీశ్‌రెడ్డి,చంద్రశేఖర్ గౌడ్,పవన్‌కుమార్‌రెడ్డి,గొడుగు వెంకటయ్య,రవికుమార్‌లతో పాటు ఇతర సభ్యులు నాగరాజు,వెంకటేష్,రాజు,విజయ్,వెంకటేష్,రఘు తదితరులు శాలువలతో సన్మానించారు.అనంతరం అడహక్ కమిటీ కన్వీనర్ విజయరాజు యూనియన్ దాదాపు మూడొందల మంది సభ్యుల జిల్లా సభ్యత్వాల జాబితాను రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్‌కు అందించారు.

ఫోటో : 9బీపీఆర్002 : ఐజెయు జిల్లా అడహక్ కమిటీ ప్రత్యేక సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్

ఫోటో : 9బీపీఆర్003 : జిల్లా జర్నలిస్టుల జాబితాను సమర్పించి కార్యదర్శి మధుగౌడ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

## సీనియర్ అసిస్టెంట్‌కి పదోన్నతి

**వెల్దండ, నవంబరు 9 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్న తుమ్మల రేవంత్ రెడ్డి పదోన్నతి పై బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ అయ్యి నియామక పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు దేవ సహాయం ఉపముఖ్య కార్యనిర్వహణ అధికారి గోపాల్ అందజేశారు.సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో విధులు నిర్వర్తించేందుకు అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలు అన్ని విధాల సహకరించారని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, నవంబరు 9 ప్రభాతవార్త :** అజిలాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని లాలు తండాకు చెందిన నేనావత్ చౌలి అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని టిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.5000 లను బిఆర్ఎస్ పార్టీ నాయకులు సిద్దగోని రమేష్ గౌడు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, గణేష్ గౌడ్, వెంకటేష్, దామలు నాయక్, బాలు లాలుతో పాటు తదితరులు ఉన్నారు.

## అన్ని పార్టీలకు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి అవసరం

### - బీసీ సమాజ్ "చాయ్ పే చర్చ" లో మోడల శ్రీనివాస్ సాగర్

**మహబూబ్‌నగర్, నవంబర్ 9,ప్రభాతవార్త :** బీసీ సమాజ్ మహబూబ్ నగర్ జిల్లా ఆధ్వర్యంలో క్రిస్టియన్ పల్లి లోని ఎం వి ఎస్ కళాశాల మైదానంలో చాయ్ పే చర్చ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మరియు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు అమలు కావాలంటే అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పనిచేస్తేనే సాధ్యమవుతాయని అన్నారు.తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో పెడితేనే తప్ప బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత ఉంటుందన్నారు. బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇవ్వాలని లేనిపక్షంలో బీసీల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి వస్తుందన్నారు.వివిధ కుల సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ బీసీ భావజాలాన్ని నియోజకవర్గాలకు మండలాలకు గ్రామ స్థాయికి విస్తరించినప్పుడే బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని మన ఓటు మనకే వేసుకుని బీసీలను అత్యధిక మందిని చట్టసభల్లోకి పంపేందుకు కంకణబద్ధులై పని చేయాలని సూచించారు..ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, రిటైర్డ్ సబ్ రిజిస్టర్ వెంకటయ్య, రిటైర్డ్ జిహెచ్ఎం శ్రీనివాసులు,రిటైర్డ్ టీచర్ భగవంతు,రిటైర్డ్ ఎంఈఓ కురుమూర్తి,తీగినీ జిల్లా అధ్యక్షుడు పట్నం చెన్నయ్య, తీగినీజిల్లా ప్రధాన కార్యదర్శి బాల శంకర్, రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.ఎన్. విజయకుమార్, ఇంటలెక్చువల్ ఫోరం జుర్రు నారాయణ యాదవ్,కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, సగర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, జాంగ్ర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మహేందర్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా యూత్ ప్రెసిడెంట్ పాలమూర్ వెంకటేష్ గౌడ్, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ బి.శేఖర్, బీసీ సమాజ్ మహబూబ్నగర్ నియోజకవర్గ కన్వీనర్ దుర్గేష్, బీసీ సమాజ్ భూత్పూర్ మండల కన్వీనర్ ఆంజనేయులు, టు వీలర్ మెకానిక్ అసోసియేషన్ పట్టణ ఉపాధ్యక్షుడు టి .కృష్ణ, ఉమాపతి,బీరయ్య, మోహన్, వెంకటయ్య ,భాస్కర్,రాఘవేంద్ర, టీచర్ కృష్ణ, వెల్టూర్ నరేందర్, రఘు,సాయి శంకర్, జగన్, బీసీ నాయకులు పాల్గొన్నారు.



చర్చలో పాల్గొన్న నాయకులు

## శాలి వాహన నూతన కమిటీ ఎన్నిక


శాలివాహన కమిటిని ఎన్నుకున్న దృశ్యం

**వనపర్తి, నవంబరు 9 ప్రభాతవార్త :** శ్రీరంగాపురం మండలం లోని ప్రసిద్ధిగాంచిన శ్రీ రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో శాలివాహన నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఆదివారం వివిధ గ్రామాల నాయకులు ఏకగ్రీవంగా అధ్యక్షులను ఉపాధ్యక్షులను కమిటీ మెంబర్స్‌ను ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఊరకొండ శేఖర్, ఉపాధ్యక్షులుగా జానకి రాములును ఎన్నుకున్నారు. మీరు మాట్లాడుతూ సంఘానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొనడం జరిగింది.

## 23న మాలల రణభేరి మహాసభ విజయవంతం చేయాలి

### - మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్, నవంబర్ 9,ప్రభాతవార్త:** నవంబర్ 23న హైదరాబాద్ లోని సరూర్ నగర్ స్టేడియం గ్రౌండ్‌లో తలపెట్టిన మాలల రణభేరి మహాసభ విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మాలల చైతన్య యాత్ర లో భాగంగా మహబూబ్ నగర్ కు వచ్చిన నాయకులు అంబేద్కర్ కళా భవన్ లో ముఖ్యనాయకులతో కలిసి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత జనాభా లెక్కలు లేకుండా, ఎలాంటి ఎంపరికల్ డేటా తీసుకోకుండా సుప్రీం కోర్టు సూచనలను పాటించకుండా 2011 జనాభా లెక్కల తో వర్గీకరణ చేసిందని, రోస్టర్ పాయింట్ల కేటాయింపు లోను మాలలకు తీవ్ర నష్టం జరిగేలా సబ్ కమిటీ సభ్యులు కుట్రపూరితంగా చేశారని, 5 కేటాయించిన గ్రూప్ 3 లోని మాలలకు, 1 ఉన్న గ్రూప్ 1 లోని వారికంటే తక్కువ ఉద్యోగాలు వస్తున్నాయంటే 1 కంటే తక్కువ రిజర్వేషన్ ను మాలలకు కేటాయించారని ఇదేనా కాంగ్రెస్ సామాజిక న్యాయం అని వారు దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మాలలకు చేసిన అన్యాయం పై ప్రశ్నించేందుకు నవంబర్ 23 న హైదరాబాద్ లో జరిగే మాలల రణభేరి మహాసభకు మాలలంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కానుగడ్డ యాదయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల కృష్ణయ్య, జిల్లా నాయకులు బేగరి చెన్న కేశవులు, గోకం చెన్నయ్య, బేగరి శ్రీనువాసులు, మిట్టమీది బాలరాజు, బేగరి రమేష్,, దాసరి సదా రాములు గుడుమాల చెన్నయ్య, ఎడ్ల శ్రీశాంత్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

## జూబ్లీహిల్స్ ప్రచారంలో నాయకులు

**జడ్చర్ల, నవంబర్9,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మాగంటి సునీత గోపినాథ్ గెలుపుకోసం రహిమత్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో మాజీఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి,ఎస్ రాజేందర్‌రెడ్డి,పట్నం నరేందర్‌రెడ్డి, నాయకులు కోడుగల్‌యాదయ్య,పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, రఘుపతి రెడ్డి,పిట్టలమురళీ.ఇంతియాజ్‌ఖాన్,మహిమూద్ పాల్గొన్నారు.

## మదర్ షావలి గంధోత్సవం వేడుకలకు హాజరైన నాయకులు

**కల్వకుర్తి, నవంబరు 9 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో సుభాష్‌నగర్‌లో ఏర్పాటుచేసిన గ్యార్మీ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన విద్య కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేష్, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, దర్గాలో ప్రార్థనలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శానవాజ్ ఖాన్, ఎజాస్, మార్కెట్ డైరెక్టర్ మసూద్, మైనారిటీ నాయకులు సోఫీ, ఆరిఫ్, ముక్తార్, ఖయ్యూం, హిమాయత్, అవేజ్,జిలాని సాలం తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌తో ప్రజలకు సత్వర న్యాయం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

విధులు నిర్వర్తించే కానిస్టేబుల్‌లు మరియు ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తమ కేసులు లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవాలనుకునే వారు సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందుతుందని ఎస్పీ డి జానకి అన్నారు.

# విద్య పట్ల ఆసక్తి ఉన్న వారికి ఓపెన్ స్కూల్ చక్కని సువర్ణ అవకాశం

### అడ్మిషన్లను పొందినవారు తప్పనిసరిగా తరగతులకు హాజరు కావాలి.. రాష్ట్ర ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ యం. సోమిరెడ్డి

**నాగర్‌కర్నూల్, నవంబరు 9 ప్రభాతవార్త :** విద్య పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఓపెన్ స్కూల్ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యావంతులు కావాలని ఓపెన్ స్కూల్ లో అడ్మిషన్ పొందిన వారు విధిగా ప్రతి రెండో శనివారం, ఆదివారం తరగతులకు హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ యం. సోమిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల లో బోధన ప్రక్రియలను రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి, ఓపెన్ స్కూల్ బోధనా తరగతులను పరిశీలించారు.ఓపెన్ స్కూల్ సెంటర్ల లో విద్యార్థుల నమోదు, హాజరు వివరాలను పరిశీలించారు. రెండవ శనివారం, ఆదివారం నిర్వహించే తరగతులకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా కృషి చేయాలని ఓపెన్ స్కూల్ సెంటర్ కోఆర్డినేటర్లకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా విధానంలో 10 మరియు ఇంటర్మీడియట్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. ఈ విద్యాపీఠం జారీ చేసే సర్టిఫికెట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందియుండి, ఉన్నత చదువులకు మరియు ఉద్యోగాలు పొందుటకు అర్హత కలిగి ఉంటుందన్నారు. పదవ తరగతిఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆయా సెంటర్లలో ప్రణాళికబద్ధంగా తరగతులు నిర్వహించాలని సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ మండలాల్లో 18 సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 202526 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతిలో 403 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ లో 996 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతులపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులు తరగతులకు 100 హాజరయ్యేలా కృషి చేయాలని కోఆర్డినేటర్ లను ఆదేశించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు అన్ని పోటీ పరీక్షలు వ్రాయడానికి అర్హులని తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో పరీక్షలు వ్రాసే అవకాశం ఉందన్నారు. చదువు మధ్యలో ఆపేసిన వారికి ఇదొక సువర్ణ అవకాశం అని ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు.ఆయన వెంట జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివ ప్రసాద్, ఆయా సెంటర్ల అధ్యాపకులు రవి ప్రకాష్, తిరుపతయ్య, అహ్మద్, యాదగిరి బాలరాజు తదితరులు ఉన్నారు.


ఓపెన్ స్కూల్‌లో బోధన ప్రక్రియను పరిశీలిస్తున్న రాష్ట్ర ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ యం. సోమిరెడ్డి

## సాధన సభను విజయవంతం చేద్దాం

-మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి



కరపత్రాలను విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

గజ్వేల్, నవంబరు 9 (ప్రభాతవార్త): జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఈనెల 26న రాజ్యాంగ హక్కుల సాధన కోసం నిర్వహించనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం చేర్యాలలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు యువజన కార్యదర్శి నీరుడి స్వామి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ఎంతకైనా పోరాటం చేయాలని, రాజ్యాంగ హక్కులను సాధించడానికే జాతీయ మల మహానాడు ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఉపాధ్యక్షుడు పాములపర్తి స్వామి, నీరుడి కుమార్, మాల మహానాడు నాయకులు జంగం కాశి, నీరుడి సంపత్, పెండ్యాల మల్లేశం, కప్ప గణేష్, జంగ అరుణ్, ప్రభాకర్, పృధ్విరాజ్, ఆరెపల్లి భరత్, వంశీ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ప్రచారంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



నారాయణఖేడ్, నవంబర్ 9 ప్రభాతవార్త ః హైదరాబాద్ పట్టణంలోనీ జీహెచ్ఎంసీ పరిధిలోని జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో బాగంగా ఎన్నికల ప్రచారం చివరి రోజు ఆదివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గారికి మద్దతుగా ఉదయం నుండి విస్తృతంగా ఇంటింటి ప్రచారంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారితో కలిసి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గారినీ అత్యధిక మెజారిటీతో ప్రజలను కోరారు. ప్రచారంలో వారితో పాటు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కాండేట్ నీలం మధు ముదిరాజ్, మెట్టు సాయి కుమార్ ఫిషరీస్ ఛైర్మెన్, విఠల్ రెడ్డి, తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనడం జరిగింది.

## దాడులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



నారాయణఖేడ్, నవంబర్ 9 ప్రభాతవార్తః బాధిత కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలి కులాంతర ప్రేమవివాహం చేసుకున్నారని ఇల్లుకు నిప్పంటించి దాడి చేసిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు, అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు బి,కాన్షీరాంలు నారాయణఖేడ్ స్థానిక అంబేద్కర్ భవనంలో ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని జరా సంఘం మండలం కక్కెర వాడ గ్రామంలో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారని అమ్మాయి బిసి (గొల్ల) కుటుంబ సభ్యులు అబ్బాయి బిసి (బోయిని) ఇంటికి ఈనెల మూడో తేదీన పట్టపగలే నిప్పంటించి అబ్బాయి రాధాకృష్ణ కుటుంబ సభ్యులపై భౌతిక దాడిచేసారని దాడిలో అబ్బాయి తండ్రిరాములునుకొట్టడంతోఅతనికితీవ్రగాయాలయ్యాయని నిప్పంటుకొని ఇంటితలుపులువంటగదికాలిపోయిందనివిలువైనవస్తువులు కాలిపోయాయని అన్నారు. ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని భౌతిక దాడి చేసిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కులాంతర (ప్రేమ వివాహం) చేసుకున్న రాధాకృష్ణ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని గ్రామంలో శాంతియుత వాతావరణం కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ో కెవిపియస్ జిల్లాసహాయ కార్యదర్శి యస్, గణపతి, అశోక్ ు పాల్గొన్నారు.

## నీట మునిగి వ్యక్తి మృతి..

పాపన్నపేట, నవంబర్ 9, ప్రభాతవార్త ః నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని చెక్ డ్యాం సమీపంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు వివరాలు...మండల పరిధి నార్సింగి గ్రామానికి చెందిన వడ్ల మహేష్ (33) గ్రామానికి చెందిన నర్సింలు అనే స్నేహితుడితో కలిసి బుధవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా ఏడుపాయల ఆలయానికి వెళ్లారు. అక్కడి నుంచి మహేష్ హైదరాబాద్ లో బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పడంతో నర్సింలు ఒక్కడే తిరిగి గ్రామానికి వెళ్లాడు.కాగా మరుసటి రోజు బంధువులకు వాకబు చేయగా మహేష్ తన వద్దకు రాలేదని చెప్పారు.దీంతో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆచూకీ కోసం గాలించారు.శనివారం ఠాణాలో ఫిర్యాదు చేశారు.ఈ క్రమంలో శనివారం రాత్రి ఏడుపాయల చెక్ డ్యాం సమీపంలో నీటిలో తెలియాడుతున్న యువకుడి మృతదేహం స్థానికులకు కనిపించింది.దీంతో పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులుఘటనా స్థలానికి చేరుకొని వరిశీలించారు. ఆనవాళ్లనుబట్టి మృతిచెందిందిమహేష్ గా నిర్ధారించారు.కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.మృతుడి తల్లి వజ్రమ్మ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## భూ కబ్జా చేసిన వారిపై కేసు నమోదు

శివ్వంపేట, నవంబర్ 9 (ప్రభాతవార్త) మండలంలోని దొంతి గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 433 లో 7 ఎకరాల 13 గుంటల భూమి గ్రామానికిచెందినతడిసిన సంజీవరెడ్డి తాత తండ్రుల 40 సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. గత కొన్ని రోజుల నుండి దొంతి గ్రామానికి చెందిన చుక్క శ్రీనివాస్, చుక్క రాణి సర్వే నంబర్ 433 లో భూమిలో అక్రమంగా ప్రవేశిస్తున్నారని ఈనెల 9న ఉదయం 8 గంటల 30 నిమిషాల సమయంలో చుక్క శ్రీనివాస్, చుక్కరాని, నక్క శ్రీధర్, చుక్క సుధాకర్, మరి కొందరు కలిసి అక్రమంగా ప్రవేశించి భూమి ట్రాక్టర్లతో చదునుచేస్తూ కడీలు పాతి తిడుతూ బెదిరిస్తున్నారని సంజీవరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ చేపట్టి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

# రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డుల ప్రధానోత్సవం

కోహెడ,నవంబరు 9, ప్రభాతవార్త : బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న హైదరాబాద్‌లోని మినీ రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి బాలమిత్రఅవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సంఘ సేవకులు, బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. కోహెడ మండల కేంద్రంలో ఆదివారం 14న బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి బాలమిత్ర అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. చిన్నారి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. చిన్నారి బాల బాలికలలో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి తీసేందుకు ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మక శక్తి పెంచేందుకు ఈ కార్యక్రమందోహదపడుతుందన్నారు. దేశభక్తి పాటలు, భరతనాట్యం, గిటార్, కీబోర్డు, ప్లేయింగ్, ఫ్లూటు, పర్వతా హోరన, యోగా, చిత్రలేఖనం, కార్టూన్స్, కవిత్వం, జానపద నృత్యం, జానపద పాటలు, మిమిక్రీ, మ్యాజిక్, సైకిలింగ్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బ్యాట్మెంటన్, చెస్, పుటుబాల్, రన్సింగ్, జాతీయ సమైక్యత శిబిరం, కరాటే, కూచిపూడి, కోలాటం, తబలా, స్కిటింగ్, టెన్నిస్, అర్చరి రంగాలలో నైపుణ్యం గల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి బాలమిత్ర అవార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గవ్వ కమలమ్మ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు గవ్వ వంశీధర్‌రెడ్డి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంట అజయ్ పటేల్, బాలల హక్కుల ప్రజా వేదిక జిల్లా నాయకులు వేముల శ్రీనివాస్, పొలవేణి కుమారస్వామి, సముద్రాల ఓంకార్, మూల ప్రభాకర్‌రెడ్డి, బట్టు రాజిరెడ్డి, కందుకూరు రాకేష్, బాలల హక్కుల ప్రజా వేదిక నాయకులుపాల్గొన్నారు.



## కౌన్సిల్ సభ్యుడిగా యెదిరె రమేష్ నియామకం

జోగిపేట, నవంబర్ 9, ప్రభాతవార్త: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ కౌన్సిల్ సభ్యుడిగా జోగిపేటకు చెందిన యెదిరె రమేష్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసింది. గత కౌన్సిల్ పదవీకాలం ముగియటంతో ప్రభుత్వం నూతన కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిటి సభ్యులు మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. దీనికి హెల్త్ సెక్రెటరీ ఎక్స్ అఫీషియో ఛైర్ పర్సన్‌గా వ్యవహరిస్తుండగా మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌లు మెంబర్ సెక్రెటరీలుగా ఉండారు. కాగా రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లపై నియంత్రణకోసం ప్రభుత్వం ఈ నూతన కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో జోగిపేటకు చెందిన రాష్ట్ర ఫార్మాసిస్టు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ యెదిరె రమేష్‌కు చోటు దక్కింది. ఈమేరకు తనను క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు యెదిరె రమేష్ కృతజ్ఞతలు తెలియచేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

## హత్నూరులో చురుకుగా వరి కొనుగోళ్లు

హత్నూర నవంబర్ 9 ప్రభాతవార్త : హత్నూర సొసైటీ ఆధ్వర్యంలో హత్నూర మండలంలో 17 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు హత్నూర సొసైటీ సీఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తేమ శాతాన్ని ప్రభుత్వం సూచించిన మేరకే తీసుకుంటున్నామని ఆయన అన్నారు సొసైటీ పరిధిలోని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాలను తరలించడానికి మండలంలోని మంగాపూర్ పరిధిలోని సూర్య రైస్ మిల్, కొన్యాల గ్రామ పరిధిలోని వీరభద్ర రైస్ మిల్ లు కేటాయించారని అన్నారు. సూర్య, వీరభద్ర ఏ రైస్ మిల్లులో కూడా రైతుల నుంచి వచ్చిన వరి ధాన్యం నుండి తూకంలో అదనంగా కోతలు విధించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

## శ్రమదానం చేసి... రోడ్డు సరిచేసి...

పాపన్నపేట, నవంబర్ 9, ప్రభాతవార్త ఃఇటీవల కురిసిన వర్షాలకు మెదక్ ,బొడ్మెట్పల్లి ప్రధాన రహదారిపై, పాపన్నపేట మండలం ఎల్లాపూర్ వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి, వాటిని అధికారులు ఎవరు సరి చేయకపోవడంతో, ఆ గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ముందుకు వచ్చి ట్రాక్టర్ తో మట్టి తెచ్చి రోడ్డును సరి చేశారు, పలువురికి స్ఫూర్తిగా నిలిచారు, రోడ్డు చెడిపోయి నెలలు గడుస్తున్న మరమ్మత్తు చేయకపోవడంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు గుంతలో పడి చాలామంది గాయాలపాలయ్యారు, ఇది గమనించిన ఆ గ్రామ యువకులు బ్యాగరీ అమృతి, దుద్దెలశేఖర్, హోటల్ భాను ప్రసాద్, దుద్దెలప్రభు, గాలి సతీష్ ట్రాక్టర్ తో మట్టి తీసుకొచ్చి గుంతలను సరి చేశారు. పలువురికి ఆదర్శప్రాయంగా నిలిచారు.

## జర్నలిస్టుల నూతన కార్యవర్గం ఎన్నిక

నంగునూర్, నవంబరు 9,ప్రభాతవార్త : మండల జర్నలిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మహేందర్‌గౌడ్, మండల అధ్యక్షులుగా బూసిరెడ్డి నరోత్తంరెడ్డి, ఉపాధ్యక్షులుగా సొప్పరి రాములు, పంగ రవి, ప్రధాన కార్యదర్శిగా పబ్బతి రాజిరెడ్డి, ప్రచార కార్యదర్శిగా చేర్యాల తులసీదాస్, కోశాధికారిగా పంగ లింగం, సహాయ కార్యదర్శులుగా జంగిటి సత్యం, సిలివేరి కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా రంగు రాజుగౌడ్, పోలసాని సుధాకర్, చల్లారం రాజశేఖర్‌రెడ్డి, వనపర్తి శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం



అక్కన్నపేట, నవంబరు 9, ప్రభాతవార్త మండలంలోని మల్లంపల్లి గ్రామంలో ఇటీవల మొంథా తుపాను కారణంగా ఇద్దరుదంవతులుఇనవల్లి కల్పనప్రణయ్‌లువరదల్లో కొట్టుకుపోయి భార్య భర్తలు ఇద్దరు మృతిచెందగా మృతురాలు కల్పన కుటుంబానికి వారి 2012 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు16500 రూపాయలు ఆర్థికసహాయం అందించారు.వారు మాట్లాడుతూ చిన్నతనంలో వారితో పాటు ఆడుతూ, పాడుతూ, చదువుకున్న కల్పన మృతి చెందిందంటే జీర్ణించుకోలేకపోతున్నామన్నారు.

## ఏడుపాయల్లో భక్తుల కోలాహలం



పాపన్నపేట, నవంబర్ 9, ప్రభాతవార్త ఃపవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాత సన్నిధిలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది , ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఏడుపాయలకు చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు, గత కొన్ని రోజులుగా సింగూరు ప్రాజెక్ట్ నుండి దిగువకు నీటిని వదలడం తో ఘనపూర్ ఆనకట్ట మీదుగా పెద్ద ఎత్తున వరద నిజాంసాగర్ వైపు పరుగులు పెడుతుంది, దీంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపాల్ లో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులుఅమ్మవారిని రాజగోపురంలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ఇవో చంద్రశేఖర్, సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, శ్యామ్, మధుసూదన్ రెడ్డి, నర్సింలు, బత్తిని రాజు, వరుణ్ చారి, యాదగిరి తదితరులు ఏర్పాటు చేయగా, వేద పండితులు శంకరశర్మ ,పార్థివ శర్మ, రాము శర్మ తదితరులు పూజలు నిర్వహించారు, ఏడుపాయలలో ఏలాంటి సంఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు.

## లారీ ఢీ కొని ఒకరు మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కొమురవెల్లి, నవంబర్ 9, ప్రభాతవార్తద్విచక్ర వానానాన్ని లారీ ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన కొమురవెల్లి మండల పరిధిలోని మర్రి ముస్త్యాల లెనిన్ నగర్ గ్రామాల మధ్యలో రోడ్డు ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా చిన్నకోడూరు మండల పరిధిలోనిగంగాపూరం గ్రామానికి చెందిన ఎర్ర నర్సయ్యఅలియాస్ రమేస్ తన భార్య సునిత, కూతురు కీర్తనతో కలిసి తన ద్విచక్ర వాహనంపై చేర్యాలకు వెళ్లి తిరిగి సిద్దిపేటకు వస్తుండగా లెనిన్ నగర్ దాటిన తర్వాత ఎదురుగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై నున్న సునిత తలకు తీవ్రగాయాలై మృతి చెందింది, సునిత భర్త రమేష్,కూతురు కీర్తనకు తీవ్రగాయాలుకాగాచికిత్స కోసం సిద్దిపేటకు తరలించినట్లు తెలిసింది. కాగా మృతురాలు సునిత ఎఎన్ఎంగా ప్రభుత్వ అసుపత్రిలో పని చేస్తున్నట్లు సమాచారం. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన రమేష్ దళిత వర్కింగ్ జర్నలిస్టుల ఫోరం జిల్లా పిఆర్ఓగా పని చేస్తున్నారు. కొమురవెల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషాదకర సంఘటన పట్లదళితవర్కింగ్‌జర్నలిస్టులసంఘం నాయకులతో పాటు, అన్ని జర్నలిస్టుల సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

## సభ్యులకు సంఘాల నిర్వహణపై శిక్షణ

నర్సాపూర్,నవంబర్9, ప్రభాతవార్త:: నర్సాపూర్ పట్టణంలోని గ్రామైక్య సంఘం కార్యాలయంలో గ్రామసంఘాల, మండల సంఘాల నిర్వహణపై ఆదివారం రెండవ రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వరంగల్ నుండి వచ్చిన సీనియర్ సిఆర్పిలు షాహిద్,సరిత లు గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వరంగల్ సిఆర్పిలు షాహిన్, సరిత లు సంఘాల బలోపేతం కోసం చేయవలసిన విధులను,బాధ్యతలను తెలియజేశారు. బాధ్యతలపై క్లుప్తంగా వివరించి శిక్షణ ఇవ్వడం జరిగింది. ో ఏ పీ ఎం సంగమేశ్వర్, సీసీలు నాగరాజు నర్సింలు ప్రవీణ దేవి సింగ్ రవీందర్ అకౌంటెంట్ మల్లేశం, గ్రామ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులు శిక్షణనిచ్చిన వరంగల్ సిఆర్పి లు షాహిన్, సరిత తదితరులు పాల్గొన్నారు

## భక్తులతో కిటకిటలాడిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం

కౌడిపల్లి, నవంబర్ 9, ప్రభాతవార్త: జిల్లాలలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరుగాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం కార్తీక మాసం మూడవ ఆది వారం నాడు భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండియే భక్తుల తాకిడి పెరుగుతుపోయింది. తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయ ఇంచార్జి ఈవో రంగరావు ఆధ్వర్యంలో ఆలయ పూజారి శివప్ప వేదమంత్రాల నడుమ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనాలను కల్పించారు. శివ సత్తుల శిగాలు, డప్పు చప్పుల దరువుల నడుమ అమ్మవారికి భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్ట ప్రదక్షణలు చేసిన తర్వాత అమ్మవారి ఎదుట బోనం నైవేద్యాలను పెట్టి, తీర్థ ప్రసాదాలను స్వీకరించి, అమ్మ ఆశీర్వాచనం పొందారు. కొంత మంది భక్తులు తమ కోరికలు తీర్చిన శ్రీ నల్ల పోచమ్మ తల్లికి ఒడి బియ్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయం సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు. దాతలు స్వచ్చందంగా ముందుకు వచ్చి తమకు తొచినంత విరాళాలు ఇస్తే భక్తులకు కాటేజ్‌లు నిర్మించబడుతాయని ఇంచార్జి ఈవో రంగ రావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీరితో పాటు ఆలయం జూనియర ఆసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ఆలయ పూజారి రాజేశ్వర్, గ్రామ పెద్దలు సాయాగౌడు, శంకర్, శేఖర్, చల్ల మల్లేశం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..



రెండు నెలలుగా విరిగిన పడిన విధ్యుత్ తీగలు

కంగ్టి, నవంబర్ 9 ప్రభాతవార్త ః కంగ్టి మండలం పరిధిలోని దెగులవాడి గ్రామ శివారులో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ సంబంధించిన స్థంభం నేలకొరిగి రెండు నెలలు కావస్తోంది. అయితే ప్రస్తుతం ఆ స్తంభానికి సరఫరా నిలిపివేశారు. ఇంతవరకు స్తంభం సరి చేయలేదని, వ్యవసాయానికి కరెంటు కనెక్షన్ లేక పంటలకు సేద్యం నిలిచిపోయిందని రైతులు తెలిపారు. ఈ విషయం పట్ల సంబంధిత విద్యుత్తు సిబ్బందికి తెలిపిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి స్తంభాన్ని ఎత్తి సరిచేసి కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని రైతుల డిమాండ్ చేశారు.

## శివపార్వతుల కళ్యాణానికి హాజరుకావాలి

నారాయణఖేడ్, నవంబర్9 ప్రభాతవార్త ః కార్తీక సోమవారం సందర్భంగా 10.11.2025 సోమవారం సా. 6గం ల నుండి భక్త మార్కండేయ చంద్రమోళీశ్వర దేవాలయం నందు శివపార్వతుల కళ్యాణం దీపోత్సవం జ్వాలాతోరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. భక్తుల సమక్షంలో జరిగే ఈ మహా క్రతువులోమీరందరూ భాగస్వాములై ఆ చంద్రమోళీశ్వర స్వామి కృపకు పాత్రులు కావాలని పురోహిత సార్వభౌమ శత ప్రతిష్టా చార్యరత్న మలమంచి గురురాజశర్మ వైదిక వేద స్మార్త జ్యోతిష్యచండి ఉపాసకులు కోరారు.

## 4 గురు జూదరుల అరెస్టు

-నగదు, సెల్‌పన్లు, పేకముక్కలు స్వాధీనం



పోలీసుల అదుపులో జూదరుల దృశ్యం

జహీరాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త: బహిరంగ ప్రదేశంలో జూదం ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యం కాశీనాథ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... రంజోల్ గ్రామ శివారులోని డైమండ్ హోటల్ వెనుకాల మ్యాంగో ఫామ్ హౌజ్ వద్ద బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 4గురు జూదరులను అదుపులోకి తీసుకుని 6890 రూపాయలను, 4 సెల్ ఫోన్లను, 52 పేక ముక్కలను సాధీనం చేసుకున్నామన్నారు. సుమోటోటా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాశీనాథ్ వివరించారు.

## అనుమానంతో...భార్యను హతమార్చిన భర్త

రామచంద్రాపురం,నవంబరు 9, ప్రభాతవార్త: పెళ్లినాడు చేతిలో చేయేసి చేసిన బాసలను మరిచిపోయిన భర్త కట్టుకున్న భార్యపై అనుమాన్యం పడుతూ హత్య చేసిన సంఘటనఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కేఎస్ఆర్ కాలనీలో భార్యా భర్తలు కృష్ణవేణి, బ్రహ్మయ్యలు నివాసం ఉంటున్నారు. కృష్ణవేణి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ డిసిసిబి బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తోందన్నారు. గత కొంత కాలంగా బ్రహ్మయ్య భార్య కృష్ణవేణిపై అనుమానం పెంచుకుంటూ వస్తున్నాడన్నారు. ఆదివారం ఉదయం భార్య భర్తల మధ్య గొడవ చోటు చేసుకోగా కోపోద్రుక్తుడైన భర్త బ్రహ్మయ్య భార్యపై బ్యాట్‌తో దాడి చేసి హత్యచేశాడన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## బస్సును ఢీకొన్న తుఫాన్ వాహనం

-ఒకరి మృతి-నలుగురికి గాయాలు



కంది,నవంబరు 9, ప్రభాతవార్త: ఆర్టీసి బస్సును తుఫాన్ వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో నలుగురు గాయాలకు గురైన సంఘటన చేర్యాల గేటు వద్ద చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి సంగారెడ్డి రూరల్ ఎస్ఐ మధుపూదన్‌రెడ్డి కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన కంది మండల పరిధిలోని చేర్యాల గేటు వద్ద జాతీయ రహదారిపై వెళుతున్న ఆర్టీసి బస్సును వెనకాల నుంచి వేగంగా వచ్చిన తుఫాన్ వాహనం ఢీ కొందన్నారు. తుఫాన్ వాహనంలో ప్రయాణిస్తున్న నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన బాలయ్య (52) అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడన్నారు. తూఫ్రాన్ మండలం అల్లాపూర్‌కు చెందిన ప్రవీణ్, న్యాల్‌కల్ మండలం రత్నాపూర్‌కు చెందిన ఫరీద్, మండల కేంద్రమైన సిర్గాపూర్‌కు చెందిన సీతారం, రాయచూరు చెంది కాలప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి వివరించారు.

## ప్రచారం చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

నర్సాపూర్,నవంబర్ 9, ప్రభాతవార్త: హైదాబాద్‌లోని జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గెలుపు కోసం ఎమ్మెల్యే సునీతారెడ్డి అధ్వర్యంలో నర్సాపూర్ బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ఉప ఎన్నికల్లో భాగంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎర్రగడ్డ డివిజన్ లోని ప్రతి ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఇంటింటికీ తిరిగి ఓటర్లకు తెలియజేశారు. ఈమేరకు మాజీ ముఖ్య మంత్రి. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ హాయాంలో జరిగిన అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గుర్తు కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లుకు వినతి చేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి వెంట నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు సంతోష్‌రెడ్డి ,నాయకులు పాల్గొన్నారు.